
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 105 వ భాగం

# పురంజనోపాఖ్యానం; వేనుడి చరిత్ర - 1

ఈ వ్యాసంతో మొదలయ్యేది పురంజనోపాఖ్యానం. ఈ 'పురం' అంటే ఏమిటనేది తెలియడానికి చివరి వరకూ చదవాల్సిందే. పురంజనోపాఖ్యానం పోతన భాగవతం నాలుగో స్కంధంలో ధ్రువ చరిత్ర తర్వాత వచ్చేది. ఈ ధ్రువ చరిత్ర గురించి ముందు వ్యాసాల్లో చూసాం. నారదుడు దీనిని ప్రచేతసనులు చేసే యజ్ఞంలో అందరికీ వివరించి చెప్పడం తో మొదలౌతుంది ఆ కథ. ధ్రువుడికి విష్ణువు కనిపించి 'నీ పాప పుణ్యాలు ఇక్కడే వదుల్చుకున్నాక ఎవరికీ అందని పథాన్ని పొందుతావు' అని చెప్తాడు కదా. ఆ మాట ప్రకారం ధ్రువుడు వెనక్కి వెళ్ళి రాజ్యం చేయడం, పాపం పుణ్యం పోగొట్టుకోవడం అనేది ఎలా చేసాడో చెప్తున్నాడు.

4-368 వ. ... నిరువదియాఱువే లేండ్లు భోగంబుల చేతం బుణ్యక్షయంబును, నభోగంబులైన యాగాదులచేత నశుభ క్షయంబునుం జేయుచు బహుకాలంబు దనుకఁ ద్రివర్గ సాధనంబుగా రాజ్యంబుచేసి కొడుకునకుఁ బట్టంబుగట్టి యచలితేంద్రియుండై యవిద్యారచిత స్వప్నగంధర్వ నగరోపమం బయిన దేహాదికం బగు విశ్వంబు భగవన్మాయారచితం బని, యాత్మం దలంచుచు.

భగవంతుణ్ణి చేరుకోవాలంటే త్రిగుణాలన్నింటినీ దాటాలి. పాపం, పుణ్యం అనేవి ఉండకూడదు. పాపం అనేది ఋణాత్మకం అనుకుంటే పుణ్యం ధనాత్మకం అవుతుంది. అయితే రెండూ కూడా కర్మ ప్రతిపాదితాలై మరో జన్మ కలిగించేవే కనక రెండింటినీ సమూలంగా నాశనం చేయాలి. ఎప్పుడైతే కింది లోకాలకి పోయే పాపం ఒక పాదం కోసం, పై లోకాలకి పోయే పుణ్యం మరో పాదం కోసం భగవంతుడికి అర్పించామో అప్పుడు మూడో పాదం మన అహంకారం (తల) మీద పడే సరికి ఆత్మ జ్ఞానం కలుగుతుంది, వామనావతారంలో చూసినట్టుగా. అదే చెప్తున్నాడు పైన వచనంలో. పుణ్యం ఎలా పోగుట్టుకున్నాడు? ఇరవైఆరువేల ఏళ్ళు భోగం అనుభవిస్తూ; పాపం, తనకి తెల్సి చేసినా తెలియక చేసినా

సరే, అది యజ్ఞ యాగాదులతో (జప, యోగ సాధన). అలా చేసాక మొత్తానికి వైరాగ్యంతో అంతా భగవత్స్వరూపంగా తలుస్తూ వేచి చూసేసరికి బ్రహ్మ జ్ఞానం కలిగింది. ఇదే మరో జన్మ లేని స్థితి. ఋషీకేష్ లో నివశించిన స్వామి శివానందగారు మహా సమాధికి కొన్ని రోజుల ముందు అనేకసార్లు శిష్యులతో అనేవారుట – "బ్రహ్మలోకం నుంచి విమానం వస్తోంది. ఎవరు వచ్చేవాళ్ళందరూ?"

విచిత్రం ఏమిటంటే ధ్రువుడికి దీక్ష ఇచ్చింది నారదుడే. తన దగ్గిర దీక్ష తీసుకుని ఎవరికీ చేరరాని పదం అందుకున్న ధ్రువుడి కథ ప్రచేతసులకి చెప్తూ ఏమంటున్నాడో చూడండి పోతన.

4-379.... నిజకాంతిచేతం ద్రిలోకంబులం బ్రకాశింపంజేయుచు నిర్దయాగమ్యంబును శాంతులు సమదర్శనులు శుద్ధులు సర్వ భూతానురంజనులు నచ్యుతభక్తబాంధవులు నయిన భద్రాచారులకు సుగమ్యంబును నయి గంభీరవేగంబు ననిమిషంబు నగు జ్యోతిశ్చక్రంబు సమాహితంబై గోగణంబు మేధి యందుం బోలె నెందుఁ బరిభ్రమించుచుండు నట్టి యచ్యుతపదంబునుం బొంది, విష్ణుపరాయణుండైన ధ్రువుండు త్రిలోకచూడామణియై యొప్పుచుండె; నప్పుడు భగవంతుండైన నారదుండు ధ్రువుని మహిమం గనుంగొని ప్రచేతస్సత్త్రంబునందు వీణ వాయించుచు.

జ్యోతిశ్చక్రం అంతా ఈ ధ్రువపదం చుట్టూ రాటకి కట్టిన గోవులా తిరుగుతూ ఉంటుందిట. ఆ ధ్రువపదం ఎటువంటిదంటే, మూడు లోకాలనీ ప్రకాశింపచేస్తూ ఏనాటికీ పతనం కానిదీ, భగవంతుణ్ణి చేరుకోవాలనుకునేవారికి సుగమ్యంబునై (భగవంతుణ్ణి చేరుకునే గమ్యం ఇదే సుమా అని చెప్తున్నట్టూ). మరోచోట ఈ ధ్రువ పదం గురించి చెప్తూ అంటారు – ధ్రువుడు కోరుకున్న వరంతో కలిపి; అనేక మాయావిశేషాలకీ కారణమైన నీ మోము అలా చూస్తూ ఉండడం తప్ప మరేమీ వద్దు – జ్యోతిశ్చక్రం ఎటునుంచి ఎటుతిరిగినా ధ్రువ నక్షత్రానికి వ్యతిరేక దిశలో వైకుంఠంలో శేషతల్పంలో యోగనిద్రలో ఉన్న విష్ణువు కనిపిస్తూ ఉంటాడుట ధ్రువుడికి. ఈ మాయా విశేషాల గురించి, భగవంతుడి మోము గురించీ త్యాగరాజు తన కీర్తనలలో అన్నది కూడా ఇదే – *నగుమోము కలవాని నా మనోహరుని, జగమేలు శూరుని జానకీ వరుని, సుజ్ఞాన నిధిని సూర్యలోచనుని;* పరమ శాంత చిత్త సరోజ భవ వరదాఖిల జగదానందకారకా.

పై వచనంలో మరో విశేషం ఉంది గమనించండి. ధ్రువుడికి దీక్ష ఇచ్చింది నారదుడే కదా? తన శిష్యుడికి బ్రహ్మ జ్ఞానం కలిగితే ఏమిటాయనకి ఆనందం? ప్రచేతసుల యాగంలో వీణవాయిస్తూ చెప్పే (ప్రచేతస్సత్త్రంబునందు వీణ వాయించుచు; సత్త్రము – యజ్ఞం) అంత విశేషమా? అవును విశేషమే. ఎప్పుడైతే తన శిష్యుడు తనకంటే

గొప్పవాడయ్యాడో గురువుకన్నా సంతోషించేవాడు మరొకడు ఉండబోడు కదా? ఈ విషయం మనం రామకృష్ణుల – వివేకానందుల విషయంలో కూడా చూడవచ్చు. “ఎటువంటి విషయం విన్నా నమ్మకం కలగపోతే విసిరి కొట్టండి. ఆఖరికి భగవద్గీత అయినా సరే. భగవద్గీత కృష్ణుడు చెప్పాడా, వ్యాసుడు రాసాడా అనేది అనవసరం. కృష్ణుడు కాకపోతే మరొకరెవరో చెప్పి ఉండొచ్చు. అది కాదు మనం గుర్తుంచుకోవాల్సినది. అందులో చెప్పినది మనం ఎంతవరకూ ఆచరించగలం?” అంటూ వివేకానందులు మాట్లాడితే రామకృష్ణులు కళ్ళు విప్పార్చుకుని చూసేవారుట.

.... మైత్రేయుండు విదురునకుఁ జెప్పిన క్రమంబున శుకయోగి పరీక్షితున కెఱింగించిన తెఱంగున సూతుండు శౌనకాదులకు వినిపించి వెండియు నిట్లనియె నట్లు చెప్పిన మైత్రేయునిం గని విదురుం డిట్లనియె.

ఇదీ పురంజనోపాఖ్యానం మొదలు బెట్టబోయే ముందు జరిగిన కథ. మొదట్లో మహాభారత యుద్ధానంతరం శ్రీకృష్ణ నిర్యాణం తర్వాత తీర్థయాత్రలకి బయల్దేరిన విదురుడికి మైత్రేయ మహర్షి చెప్పినది. అలా మైత్రేయుడు చెప్పాడు అని శుకమహర్షి పరిక్షిత్తుతో అంటున్నాడు. ఈ కథంతా సూతుడు శౌనకాదులకి చెప్తున్నాడని పోతన వచనం. అంటే మనకి పోతన చెప్పినది మూడో తరం కథ అన్నమాట.

ఈ కథంతా ఎక్కడ జరిగిందో చూసాం. నారదుడు ప్రచేతసనులు చేసే యాగంలో. పరిక్షిత్తుకో సందేహం.

సీ. అనఘాత్మ! నారదమునిపతి ధ్రువ చరి
త్రము ప్రచేతసుల సత్త్రంబునందు
నర్థిమై గీర్తించె నంటి; ప్రచేతసు
లన నెవ్వ? రెవ్వరి తనయు? లెట్టి
వంశజుల్? సత్త్ర మెవ్వల నను జేసి? ర
ధ్వరమందు నిజకుల ధర్మశీలు
రగు ప్రచేతసులచే యజియింపఁగాఁ బడె
యజ్ఞపూరుషుఁ డెట్టు లచ్యుతాంఘ్రి [4-385]

తే. భక్తియుక్తుఁడు విదిత సద్భాగవతుఁడు
దివిరి హరిపాదసేవా విధిప్రయుక్త
దేవదర్శనుఁ డగు నట్టి దివ్యయోగి
నారదుం డెట్లు గొనియాడె శౌరికథలు? [4-385.1]

"ఈ ప్రచేతసనులు ఎవరు? ఏ వంశస్థులు? ఎటువంటి యజ్ఞం చేసారు? అక్కడకి వెళ్ళిన నారదుడు భగవంతుణ్ణి ఎలా కీర్తించాడు? ఆ విషయాలన్నీ చెప్పు" అని అడుగుతున్నాడు మహర్షిని. పై పద్యం లో 'యజియింపగాబడె' అంటే అర్చించంచబడిన; సత్త్రము – యజ్ఞం, యాగం; అచ్యుతాంఘ్రి (చ్యుతి, పతనము లేనివాడు - భగవంతుడు; అంఘ్రి – పాదాలు) భక్తియుతుడు – భగవంతుడి పాదాలని సేవించేవాడు (నారదుడు).

సీ. చతురుఁ డాజన్మ ప్రశాంతుండు నిస్సంగుఁ
దును సమదర్శనుండును ఘనుండు
నై యాత్మయందు లోకావళి, లోకంబు
లందు నాత్మను జూచు చనఘమైన
యనుపమయోగక్రియా పావకాదగ్ధ
కర్మ మలాశయ కలనఁ బేర్చి
జడుని కైవడిఁ జీఁకు చందంబునను మూఢు
పగిది నున్మత్తుని భంగిఁ జెవిటి [4-388]

తే. వడువునను గానఁబడుచు సర్వజ్ఞుఁడై ప్ర
శాంతకీల హుతాశను సరణిఁ బొల్చి
సతత శాంతంబు నంచిత జ్ఞానమయము
నైన బ్రహ్మస్వరూపంబు నాత్మఁ దలఁచి. [4-388-1]

ధ్రువుడి కొడుకు ఉత్కలుడు. ఆయన తండ్రిలాగే ప్రశాంతమైన మనసు కలవాడు. యోగాభ్యాసంతో లోకాలన్నింటినీ తనలోనే చూస్తూ జడ్డి మనిషిలా ఉండేవాడు. ఎప్పుడైతే మనసు ఆత్మలోకి చూడడానికి అలవాటు

పడుతుందో అప్పుడది బయటకి చూడ్డానికి ఇష్టపడదు అంటారు రామకృష్ణులు. ఇదే రమణ మహర్షి చెప్పే 'నేనెవర్ని?' అనే శోధన. శ్రీ రమణుల దగ్గిరకి ఎవరు వెళ్ళినా ఆయన ఎవరితో ఏదో పెద్దగా మాట్లాడినట్టూ దాఖలా లేదు. 'మౌనంగా ఉండు అన్నీ అవే సర్దుకుంటాయ్' అని చెప్పడమే మనకి కనిపిస్తుంది. అలా మిగతావారికి దూరంగా ఉంటే లోకానికి పనికిరాని వారికింద జమకట్టడం తెల్సిందే కదా? అలాగే ఉత్కలుణ్ణి జమకట్టారు.

క. తనకంటె నితర మొక టెఱుఁ
గని కతమున సార్వభౌమకశ్రీఁ బొందన్
మనమునఁ గోరక యుండుటఁ
గని కులవృద్ధులును మంత్రిగణములు నంతన్. [4-389]

తనకంటే ఇతరం అనేది తెలియని ఈ ఉత్కలుడు (అహం బ్రహ్మాస్మి, సర్వం ఖల్విదం బ్రహ్మ అని తెల్సినవాడికి ఇంక రాజ్యలు ఎందుకు?) సార్వభౌముడిగా ఉండడం అసంభవం. ఇక్కడో సరదా కథ – రాజ్యం, సార్వభౌమత్వం గురించి. కైక రాముణ్ణి రాజ్యం వదులుకుని అడవుల్లోకి వెళ్లమంటే రాముడు లోలోపల నవ్వుకున్నాట్ట; ఎందుకంటే పధ్నాలుగు లోకాలు తనవే అయ్యీ, తానే సృష్టించిన ఈ లోకాల్లోని ఓ చిన్ని జగత్తులో మరో చిన్న భూమిలో అతి చిన్న రాజ్యాన్ని వదులుకోమంటోంది తన తల్లి అని తెలిసి. అందుకే 'ఓ అంతే కదా' అన్నాట్ట. సరే మళ్ళీ కథలోకి వద్దాం. ఉత్కలుడు రాజ్యానికి పనికిరాడని ఆలోచించి కుల వృద్ధులూ, మంత్రులూ ఏం చేసారంటే.

వ. అతని నున్మత్తునింగాఁ దెలసి తదనుజుం డైన వత్సరునికిఁ బట్టంబు గట్టిరి; ఆ వత్సరునికి సర్వర్ధి యను భార్య యందుఁ బుష్పార్ణుండును, జంద్రకేతుండును, నిషుండును, నూర్జుండును, వసువును, జయుండును నన నార్వురు తనయులు గలిగిరి; అందుఁ బుష్పార్ణుం డనువానికిఁ బ్రభయు దోషయు నను నిద్దఱు భార్య లైరి; అందుఁ బ్రభ యనుదానికిం బ్రాతర్మధ్యందిన సాయంబు లను సుతత్రయంబును, దోష యను దానికిం బ్రదోష నిశీథ వ్యుష్టు లనువారు ముగ్గురును బుట్టిరి; అందు వ్యుష్టుం డనువానికిఁ బుష్కరిణి యను పత్ని యందు సర్వతేజుం డను సుతుండు పుట్టె; వానికి నాకూతి యను మహిషి వలనఁ జక్షుస్సంజ్ఞుం డయిన మనువు జనియించె; వానికి నడ్వల యను భార్య యందుఁ బురువును, గుత్సుండును, ద్రితుండును, ద్యుమ్నుండును, సత్యవంతుండును, బుతుండును, వ్రతుండును, నగ్నిష్టోముండును, నతిరాత్రుండును, సుద్యుమ్నుండును, శిబియును, నుల్ముకుండును నను పన్నిద్దఱు తనయులు గలిగిరి; అందు నుల్ముకునికిఁ బుష్కరిణి యనుదాని వలన నంగుండును, సుమనసుండును, ఖ్యాతియుఁ, గ్రతువును,

నంగిరసుండును, గయుండును నను నార్వురు గొడుకులు పుట్టిరి; అందు నంగునికి సునీథ యను ధర్మపత్నివలన వేనుం డను పుత్రుం డుదయించిన. [4–390]

ఇక్కడనుంచి ధ్రువుడి వంశం అంతా ఎలా క్రమంగా వృద్ధి చెందుతోందనేది చెప్తున్నాడు. జడుడిగా ఉన్న ఉత్కలుడిని తప్పించి వాడి తమ్ముడు (అనుజుండు) వత్సరుడికి పట్టం కట్టారు. ఈ వచనం లో ఆడా మగా పేర్లు గమనించండి; విచిత్రంగా ఉంటాయి – పుష్కరిణి, ఉల్మకుండు, ఋతుండు, సుమనసుండు, సునీథ, ఖ్యాతి, ప్రాతర్మడు, మధ్యందినం, సాయండు (పగలు మధ్యాహ్నం సాయంత్రం). ఈ ధ్రువ వంశం అలా సాగి సాగి అంగుడనే ఆయనకి చేరింది. ఆ అంగుడికి సునీథ అనే ఆవిడవల్ల వేనుడు పుట్టాడు.

ధ్రువుడంతటి వాడి వంశంలో పుట్టిన వేనుడు ఎటువంటివాడు? అసలు ధ్రువుడితో పోల్చే మనిషేనా? ఇవన్నీ సగరుడి వంశంలో జరిగిన కథతో పోల్చి చూసుకోవచ్చు. ఇదంతా ముందు వ్యాసాల్లో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS